సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



ఆరోగ్య ఆసరాతో భరోసా
ప్రభుత్వం ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య ఆసరాలో భాగంగా రోగులకు ఆర్థిక సాయం అందిస్తోంది.
8లో

పోలీసు నిఘా నేత్రం
చోరీలను అరికట్టేందుకు పోలీసు శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ అనే సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది.
8లో



బెట్టింగ్ ముఠా అరెస్ట్
ఏలూరు గన్‌బజార్ సెంటర్‌లో బెట్టింగ్ స్థావరంపై పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.
8లో

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి మన్మధరావుకు శ్రీవారి మెమెంటోను అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. న్యాయమూర్తి మన్మధరావు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

మంత్రి ఆదిమూలంపై దాడి దారుణం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్



పాలకొల్లు అర్బన్: ప్రకాశం జిల్లా ఎర్రగుండపాలెంలో మంత్రి ఆదిమూలం సురేష్, అతని అనుచరులపై చంద్రబాబు, టీడీపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. యాళ్లవానిగరువులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, అతని అనుచరులపై సుమోటాగా కేసు తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. చంద్రబాబు ఎస్సీలను అవమానించడం మామూలేనన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతూ ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని వ్యాఖ్యానించి దారుణంగా అవమానించారన్నారు. అధికారం దాహంతో శాంతి భద్రతలకు విఘాతం కల్పించడానికి చంద్రబాబు, అతని కుమారుడు లోకేష్ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి సురేష్, అతని అనుచరులపై ఉద్దేశపూర్వకంగా కర్రలు, రాళ్లతోనూ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రకాశం జిల్లా ఎస్పీతో మాట్లాడి కేసు పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించి చంద్రబాబు, లోకేష్‌ను కమిషన్‌కు పిలిపిస్తామని చెల్లెం ఆనందప్రకాష్ తెలిపారు.

నేడు నరసాపురంలో జిల్లాస్థాయి స్పందన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు



ఏలూరు రూరల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై లక్ష్మణబాబు

ఏలూరు టౌన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ఉత్తమ సేవలే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. నేరాల నియంత్రణకు వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆదివారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్, కైకలూరు సర్కిల్‌లోని అన్ని స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. మొత్తంగా 735 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ ధరించని వారు 39, డ్రైవింగ్ లైసెన్సు లేనివారు 19, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారు ఇద్దరు, ముగ్గురు ప్రయాణం చేస్తూ పట్టుబడిన వారు 7, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు 13, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు 34 మందిపై కేసులు పెట్టామని చెప్పారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

మహిళా సాధికారత సాకారం

తరుణీ.. తరుణం
- లక్ష్యానికి మించి డ్వాక్రా రుణాలు
- నాలుగేళ్లలో రూ.8,851 కోట్ల అందజేత
- ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో మంజూరు
- స్వయం ఉపాధి దిశగా మహిళల అడుగులు



ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నారు. ఈ విధంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డ్వాక్రా రుణాలతో మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. చిన్నపాటి వ్యాపారాలు, డెయిరీ యూనిట్లు, గొర్రెలు, మేకల పెంపకం, కుటీర పరిశ్రమల నిర్వహణ వంటివి చేపడుతున్నారు. అలాగే బ్యాంకు రుణాల చెల్లింపుల్లోనూ పొదుపు సంఘాలు ముందు వరుసలో ఉండటంతో మరిన్ని రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సుముఖంగా ఉన్నారు. ఎటువంటి హామీ లేకుండా గ్రూపు సీనియార్టీని బట్టి రూ.20 లక్షల వరకూ రుణాలుగా బ్యాంకులు అందజేస్తున్నాయి. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ బ్యాంకు లింకేజీల వ్యవహారాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.

నాలుగేళ్లు.. రూ.8,851 కోట్ల రుణాలు

గత నాలుగేళ్లలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం రూ.8,851 కోట్ల డ్వాక్రా రుణాలను బ్యాంకులు అందించాయి. ఏలూరు జిల్లాలో 1,12,592 గ్రూపులకు రూ.4,900 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 84,685 గ్రూపులకు రూ.3,951 కోట్లను మంజూరు చేశారు. ప్రభుత్వం మహిళల స్వయం అభివృద్ధికి, ఆర్థిక పరిపుష్టికి ఏ మేరకు కంకణం కట్టుకుందో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

జిల్లాల వారీగా..

ఏలూరు జిల్లాలో 2019-20లో 121.65 శాతం, 2020-21లో 120.06 శాతం, 2021-22లో 158.20 శాతం, 2022-23లో 134.78 శాతం మేరకు రుణాలను అందజేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 2019-20లో 117.01 శాతం, 2020-21లో 122.01 శాతం, 2021-22లో 206.31 శాతం, 2022-23లో 165.25 శాతం రుణాలు అందించారు.

స్వయం సహాయక సంఘాలకు రుణాల అందజేత

సంవత్సరం	ఏలూరు జిల్లా గ్రూపులు	ఏలూరు జిల్లా మొత్తం (రూ.కోట్లలో)	పశ్చిమగోదావరి జిల్లా గ్రూపులు	పశ్చిమగోదావరి జిల్లా మొత్తం (రూ.కోట్లలో)
2019-20	27,103	944.96	18,922	672.15
2020-21	30,917	909.35	24,289	700.92
2021-22	29,727	1,586.11	22,908	1,352.53
2022-23	24,845	1,460.44	18,566	1,225.88
మొత్తం	1,12,592	4,900.86	84,685	3,951.48

చెల్లింపుల ప్రక్రియ బాగుంది



ఏలూరు జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లలో సగటున లక్ష్యాలను మించి 135.37 శాతం మేర డ్వాక్రా రుణాలు అందించాం. డ్వాక్రా సంఘాల సభ్యుల బ్యాంకు రుణాల చెల్లింపు ప్రక్రియ కూడా బాగుంది. దీంతో పెద్ద ఎత్తున రుణాలు అందించడంలో బ్యాంకులు సహకరిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత ఎక్కువ మొత్తంలో డ్వాక్రా రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నాం.
– ఆర్.విజయరాజు, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏలూరు

లక్ష్యానికి మించి రుణాలు



పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా సంస్థలు కృషి చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో డ్వాక్రా సంఘాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహకరిస్తున్నాం. నాలుగేళ్లుగా రుణాల పంపిణీలో పురోభివృద్ధి ఎక్కువగా ఉంది. దీంతో లక్ష్యానికి మించి సగటున 155.18 శాతం మేర రుణాలు అందించాం.
– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పశ్చిమగోదావరి జిల్లా

నాలుగేళ్లలో సగటున లక్ష్యానికి మించి ఏలూరు జిల్లాలో 135.37 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 155.18 శాతం మేరకు రుణాలు మంజూరు చేశారు.

నెలమూరుకు రాష్ట్రస్థాయి అవార్డు



నెలమూరు పంచాయతీ కార్యాలయం

పెనుమంట్ర: మండలంలోని నెలమూరు పంచాయతీ రాష్ట్రస్థాయి నవరత్న అవార్డుకు ఎంపికైంది. బాలల స్నేహపూర్వక అవార్డుకు రాష్ట్రస్థాయిలో 2వ స్థానం లభించింది. అలాగే జిల్లాస్థాయిలో నాలుగు, మండల స్థాయిలో నాలుగు అవార్డులను ఈ పంచాయతీ కైవసం చేసుకుంది. జిల్లాస్థాయిలో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామంగా మూడో, ఆరోగ్యవంతమైన గ్రామంగా రెండో, బాలల స్నేహపూర్వక గ్రామంగా రెండో స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో మల్లిపూడి, ఓడూరు గ్రామాలు కూడా ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యాయని, మండల స్థాయిలో నెలమూరుతో పాటు ఓడూరు, మాముడూరు, సత్తారామేశ్వరం, మల్లిపూడి గ్రామాలకు అవార్డులు వచ్చాయని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సూరప్పగూడెం పంచాయతీకి..

భీమడోలు: గ్రామాభివృద్ధి ప్రణాళికలో భాగంగా స్వయం సమృద్ధి, మౌలిక వసతుల కల్పనలో సాధించిన ప్రగతికి సూరప్పగూడెం పంచాయతీ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికై ంది. అలాగే ఏలూరు జిల్లాస్థాయిలోనూ ఉత్తమ పంచాయతీగా తొలి స్థానంలో నిలిచింది. ఈనెల 24న పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలో జరిగే కార్యక్రమంలో పంచాయతీ స ర్పంచ్, గ్రామ కార్యదర్శి అవార్డును అందుకోనున్నారు.

ఎవర్‌గ్రీన్ గోళీ సోడా



వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పండ్ల రసాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ ఇలా ఎన్ని ఉన్నా.. గోళీ సోడా ఓ గమ్మత్తైనా ఎవర్‌గ్రీన్ పానీయం. గ్యాస్‌తో కలగలిసి గోళీ సీసాలోని నీళ్లు గొంతులోకి దిగుతుంటే కలిగే అనుభూతే వేరు. ఎండ వేడిని తట్టుకునేందుకు రహదారి ప్రయాణికులు గోళీ సోడాను ఇష్టపడతారని కొయ్యలగూడెంలో 50 ఏళ్లుగా సోడా అమ్ముతున్న బి.రంగారావు అన్నారు. జీరా, అల్లం, ఆయుర్వేద పొడర్లు కలిపి సోడాను తయారు చేస్తున్నానని చెప్పారు.
- కొయ్యలగూడెం

1,602 మంది రైతులకు పట్టాల పంపిణీ

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన



దర్బరేవు కంపెనీ భూముల రైతులకు దస్తావేజులను అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

నరసాపురం రూరల్: నరసాపురం మండలం దర్బరేవు గ్రామంలో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యను పరిష్కరించేలా 1,754 ఎకరాల కంపెనీ భూము లకు సంబంధించి 1,602 మందికి సాగు పట్టాలు పంపిణీ చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఆదివారం గ్రామంలో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉందని, అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఒక విధానం లేక సైకో, పిచ్చివాడిగా విమర్శలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ పేదలకు మేలు చేయాలన్న తలంపుతో విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. రైతులకు వారు అనుభవిస్తున్న భూములపై సర్వహక్కులు కల్పించేందుకు సీఎం జగన్, ఆయన తండ్రి దివంగత వైఎస్సార్ ఎంతగానో కృషి చేశారన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను వ్యవసాయేతర అవసరాల కోసం వినియోగించుకునేందుకు వీలుగా చట్టాలను మార్చే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. నాలుగేళ్లలో సుమారు రూ.2 లక్షల కోట్లకు పైగా సంక్షేమ పథకాల కింద పేదల ఖాతాలకు జమ చేశామన్నారు. చంద్రబాబు ఓ పక్క పథకాలను విమర్శిస్తూనే.. మరోపక్క తాము అధికారంలోకి వస్తే పథకాలను కొనసాగిస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. దర్బరేవులో రైతులకు దస్తావేజులు పంపిణీ చేస్తున్నామని, ఏ ఒక్కరి నుంచి అయినా రూపాయి వసూలు చేస్తే మీడియా సాక్షిగా చెయ్యెత్తి చెప్పాలని సవాలు చేశారు.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ 1921 కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న కంపెనీ భూముల సమస్యను పరిష్కరించి సాగుదారులకు మేలు చేయాలనే తలంపుతో రిజిస్ట్రేషన్ చేయించి ఉచితంగా దస్తావేజులు అందిస్తున్నామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ రామ్‌సుందరరెడ్డి, రైతు తిరుమాని నాగరాజు మాట్లాడారు.సభకు సబ్ కలెక్టర్ సూర్యతేజ అధ్యక్షత వహించారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఆప్ కాఫ్ మాజీ చైర్మన్ ఆండ్రాజు చల్లారావు, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రే శ్రీవెంకటరమణ, ఆత్మా చైర్మన్ కడలి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, సర్పంచ్ పెనుమత్స విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల' పరీక్షల పరిశీలన



వట్లూరు కేంద్రంలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఫైనాన్స్ సెక్రటరీ ప్రసాద్‌బాబు

పెదపాడు: వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షల తీరును రాష్ట్ర గురుకుల పాఠశాలల ఫైనాన్స్ సెక్రటరీ ప్రసాద్‌బాబు పరిశీలించారు. ఐదో తరగతి ప్రవేశానికి 258 మంది దరఖాస్తు చేసుకోగా 216 మంది హాజరయ్యారని, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి 356 మంది దరఖాస్తు చేసుకోగా 305 మంది హాజరయ్యారని చెప్పారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, పర్యవేక్షకురాలు బేబీ సరోజిని ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం
- ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు పాట్లు
- 'పశ్చిమ'లో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు



పెనుగొండ మండలం వెంకట్రామన్నపురంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దాళ్వా వరి చేతికి వస్తున్న తరుణంలో అకాల వర్షం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షం అన్నదాతల గుండెల్లో పరుగులు పెట్టించింది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ధాన్యం తడిచిపోకుండా బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకోగా, కోత యంత్రాలతో చేపట్టే వరి మాసూళ్లను వాయిదా వేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు ఉంది. గత 20 రోజులుగా ధాన్యం మాసూళ్లు చేస్తున్నా, వారం రోజులుగా కోతలు జోరందుకున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించింది.

ముమ్మరంగా కోతలు

దాళ్వా వరి పంట ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 55 బస్తాల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే మాసూళ్లు ప్రారంభించిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం తదితర మండలాల్లో కొన్నిచోట్ల 60 బస్తాలపైగా దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న రైతులు చేలల్లో, రోడ్లపై ధాన్యం ఎండబెట్టి రైతు భరోసా కేంద్రాల వద్ద అమ్మకాలు చేస్తున్నారు. కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో అకాల వర్షం అన్నదాతలను ఆందోళన కలిగిస్తోంది.

తాడేపల్లిగూడెంలో అత్యధికంగా..

జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో పలుచోట్ల ఆదివారం వేకువజామున భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 22.2 మి.మీ, పాలకోడేరులో 20.4 మి.మీ, గణపవరంలో 15.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అర్ధరాత్రి నుంచే మేఘాలతో ఆకాశం రైతులను భయపెట్టింది. దీంతో కళ్లాల్లోని ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని ధాన్యాన్ని మెరక ప్రాంతానికి చేర్చారు.



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో..



పాలకొల్లు మండలంలో బరకాలు కప్పుతూ..



భీమవరం మండలంలో ఒబ్బిడి చేస్తూ..

ఉరుకులు పరుగులు



పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం ఉరుకులు, పరుగులు పెట్టించింది. కోతతోనే గట్టుపై ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి అవస్థలు పడ్డాం. వర్షం, ఈదురుగాలులకు గింజలు రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వర్షంతో మాసూళ్లకు వేచి చూడాల్సి వస్తోంది.
–చిల్లిముంతల శ్రీనివాస్, రైతు, చినఅమిరం

జాగ్రత్తలు తీసుకోవాలి



అకాల వర్షాలతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే గట్లకు చేరిన ధాన్యం తడిచిపోకుండా కాపాడుకోవాలి. వాతావరణం అనుకూలించే వరకూ మాసూళ్లు చేయకపోవడం మంచిది. మబ్బులు, వర్షాలతో ధాన్యం ఎండబెట్టడానికి అవకాశం ఉండదు. దీంతో ధాన్యం రంగు మారే ప్రమాదం ఉంది.
– వి.నారాయణరావు, ఏడీఏ, భీమవరం

ఫొటోగ్రాఫర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక డీసీఎంఎస్ కన్వెన్షన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు పోసిన వీరేంద్రకుమార్, కె.చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.మనోరమ పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మద్దాల శేఖర్, మెగా దుర్గారావు, గౌరవ అధ్యక్షుడిగా కాకర్ల వీరభద్రరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌హెచ్ షరీఫ్, కోశాధికారిగా కె.ఉజ్వలకుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఈ.మధు, ఎస్‌కే నయీం, ఎండీ అస్లాం, కె.వెంకటేశ్వరరావు, ఎ.శేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఫొటోగ్రాఫర్లు సైతం జీవనోపాధి పెంచుకునేలా వారికి ఫొటోగ్రఫీ వృత్తిలో మరిన్ని మెలకువలు నేర్పేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేసామని చెప్పారు.

క్లుప్తంగా

వేధింపులపై కేసు నమోదు

ముసునూరు: అదనపు కట్నం కోసం మహిళను వేధిస్తున్న భర్త, అత్త, మామ, మరిదిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని గోపవరానికి చెందిన లాగు శ్రీను కుమార్తె మల్లేశ్వరిని, చింతలవల్లికి చెందిన బుల్లా వెంకటేష్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు. ప్రస్తుతం మల్లేశ్వరి మూడు నెలల గర్భవతి. భర్త గ్రామంలోని మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు అదనపు కట్నం కోసం భార్యను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. దీనికి అతని తల్లి, తండ్రి, తమ్ముడు సహకరిస్తున్నారు. చిత్రహింసలకు తాళలేక ఆమె పలుమార్లు పుట్టింటికి వెళ్లగా, ఇరు గ్రామాల పెద్దలు సర్దిచెప్పారు. గత నెల 23న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను కాపురానికి పంపారు. వారం రోజులు బాగానే ఉన్న భర్త అత్త మామలు తిరిగి వేధింపులతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

శిశువు మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అశోక్ నగర్ ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని మగ శిశువు మృతదేహం లభించింది. 25వ వార్డుకు చెందిన గీతామాధురి స్థానిక అశోక్ నగర్‌లో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గుర్తుతెలియని మగశిశువు మృతదేహాన్ని గుర్తించి, జంగారెడ్డిగూడెం సచివాలయం -1 వీఆర్‌వో గీతాంజలికి ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్‌వో శిశువు మృతదేహాన్ని చూసి జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను బోల్తా.. ముగ్గురికి గాయాలు

పెదవేగి: కాసేపు ఆహ్లాదంగా గడుపుదామని పెదవేగి మండలం న్యాయంపల్లికి చెందిన 25 మంది ఆదివారం మినీ వ్యాన్‌లో కాకినాడ బీచ్‌కు బయలుదేరి వెళ్లారు. కాకినాడ పాత పోర్ట్ ఏరియా కనకదుర్గమ్మ గుడి దగ్గరకు వచ్చేసరికి మలుపులో ఆటో అడ్డురావడంతో వ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చెప్పెల్లి దానియేలు రాజుకు చేయి విరగ్గా, పఠాన్ బాషాకు ఎడమ చేతి వేళ్లు విరిగిపోయాయి. మాధవ్ అనే యువకుడికి చేయి విరిగింది. మిగిలిన 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆరోగ్య ఆసరాతో భరోసా

ఇంటికెళ్లే సమయంలో నగదు సాయం



పాలకోడేరు మండలం లంకలకోడేరు గ్రామానికి చెందిన మేకా శివన్నారాయణ 60 ఏళ్ళ వయస్సులో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. భార్యతో కలిసి వ్యవసాయ పనులు చేసుకునేవాడు. పిల్లలు లేకపోవడంతో రెక్కల కష్టంపై బతుకుతున్నారు. శివన్నారాయణకు గుండె వ్యాధి రావటంతో యాంజియోగ్రామ్ చేశారు. రూ.41వేలు ఖర్చు కాగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం అందించారు. కరోనరీ బైపాస్ సర్జరీ చేయాల్సి వచ్చింది. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్సకు రూ.1.20 లక్షలు ప్రభుత్వమే భరించింది. శివన్నారాయణ 20 రోజులపాటు హాస్పిటల్‌లో వైద్య సేవలు పొందాడు. అతను ఇంటికి క్షేమంగా తిరిగి వెళ్ళే సమయంలో ఖర్చులకు రూ.4500 ఆరోగ్య ఆసరాగా ప్రభుత్వం శివన్నారాయణ చేతిలో పెట్టి పంపింది.

ఆరోగ్య ఆసరాగా రూ. 8,375లు



పెదన జిన్నూరు గ్రామానికి చెందిన అంబటి స్వప్న కుమారి భర్త చనిపోవటంతో ఒంటరిగా జీవిస్తోంది. ఆమె కుమార్తె 3 ఏళ్ళ అక్షరకు బ్రెయిన్ ట్యూమర్ రావటంతో వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. జీవనమే కష్టంగా మారిన పరిస్థితుల్లో ఆపరేషన్ చేయించే ఆర్థికస్తోమత లేక తీవ్ర మానసిక వేదనకు గురైంది. ఏలూరులోని ఆశ్రం హాస్పిటల్‌కు తీసుకురాగా చిన్నారి అక్షరకు సుమారు రూ.74 వేల ఖర్చుతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స చేశారు. మరోసారి వెంటిక్యులర్ పెరిటోనియల్ స్టంట్‌ను రూ.44,900తో ఉచితంగా వేశారు. చిన్నారి అక్షర హాస్పిటల్‌లో 45 రోజులు ఉండడంతో ఇంటికి వెళ్ళే సమయంలో ఆరోగ్య ఆసరాగా రూ. 8375 ఇచ్చి పంపారు.

- ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్స అనంతరం రోగులకు ఆర్థిక సాయం
- రెండు జిల్లాల్లో ఆరోగ్య ఆసరాలో రూ.32.12 కోట్ల లబ్ధి

ఏలూరు టౌన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆనాడు పేదవర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయాలనే ఉన్నతాశయంతో ఆరోగ్యశ్రీ పథకానికి రూపకల్పన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తృతం చేయటంతోపాటు ఏకంగా వైద్య సేవలను 3,240 రోగాలకు విస్తరించి, పేదలపై ఒక్క రూపాయి భారం పడకుండా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏకంగా 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ ఏడాది కాలంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో రూ.181.34 కోట్లు వెచ్చించి, 70,949 మందికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. ఇక ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వెళ్ళాక ఏ పనీ చేయలేక విశ్రాంతి తీసుకుంటూ కాస్త పౌష్టికాహారం తీసుకునేలా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకంతో అండగా నిలుస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో ఏడాది కాలంలో వైఎస్సార్ ఆసరాలో రూ.32.12 కోట్లను 52,787 మందికి అందజేశారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో భరోసా



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో విస్తృతమైన సేవలు అందిస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలోనూ ఏడాది కాలంలో వేలాది మంది పేదవర్గాలకు చెందినవారు ఉచితంగా వైద్య చికిత్సలు పొందారు. ఏడాది కాలంలో ఉమ్మడి పశ్చిమలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 70 వేలకు పైగా ప్రజలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశారు. వైఎస్సార్ ఆసరా పథకంలో 52 వేల మంది ప్రయోజనం పొందారు. ఆరోగ్య ఆసరా పథకంలో ఉమ్మడి పశ్చిమలో సుమారుగా రూ.32.12 కోట్ల లబ్ధి చేకూరింది.

డాక్టర్ తాతపూరి ఆంద్రూ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

పశ్చిమగోదావరి జిల్లాలో	
ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు	- 36,282
ఆపరేషన్లకు ప్రభుత్వ ఖర్చు	- రూ.96.70 కోట్లు
వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులు	- 26,254
ఇంటికి పంపుతూ రోగికి ఇచ్చిన సొమ్ము	- రూ.16.32 కోట్లు
ఏలూరు జిల్లాలో	
ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు	- 34,667
ఆపరేషన్లకు ప్రభుత్వ ఖర్చు	- రూ.84.64 కోట్లు
వైఎస్సార్ ఆసరా పథకంలో సాయం పొందిన లబ్ధిదారులు	- 26,533
డిశ్చార్జ్ సమయంలో ఇచ్చిన సొమ్ము	- రూ.15.80 కోట్లు
పశ్చిమగోదావరి జిల్లాలో	
ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్	- 67
ప్రైవేటు హాస్పిటల్స్	- 19
డెంటల్ హాస్పిటల్స్	- 08
ప్రభుత్వాసుపత్రులు	- 40
ఏలూరు జిల్లాలో	
ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్	- 102
ప్రైవేటు ఆసుపత్రులు	- 26
డెంటల్ హాస్పిటల్స్	- 07
ప్రభుత్వాసుపత్రులు	- 69

గుడిమెట్లకు పురస్కారం

కొయ్యలగూడెం: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య అందజేస్తున్న ఆంధ్ర రత్న పురస్కారానికి ఎంపికైనట్లు గుడిమెట్ల గంగాధర్ ఆదివారం పేర్కొన్నారు. సోషల్ సర్వీస్ కార్యక్రమాలలో భాగంగా 2023వ సంవత్సరానికి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసిందని చెప్పారు. సోమవారం నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నట్లు తెలిపారు.

షేక్ సాబ్జీ తీరు సిగ్గుచేటు

దెందులూరు: దేవుని దర్శనాన్ని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ వ్యాపారం చేయడం, దర్యాప్తు సంస్థలకు అడ్డంగా ఆధారాలతో దొరికిపోవడం సిగ్గుచేటని కేంద్ర విజిలెన్స్ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ జిల్లా నేత సీహెచ్ విక్రమ్ కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపన్నపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవుని దర్శనానికి ఫేక్ ఆధార్ కార్డులతో, నెలకు 19 సిఫార్సు లెటర్లు ఇవ్వడం వెనుక ఎమ్మెల్సీ వ్యాపార బుద్ధి అర్థమవుతుందని అన్నారు. ఈ విషయాన్ని బీజేపీ సీరియస్‌గా తీసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌తో ఈ విషయంపై మాట్లాడతానని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గొల్లగూడెంలో వ్యక్తి మృతదేహం

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెంలో కృష్ణాలయం వద్ద గుర్తు తెలియని 50 ఏళ్ల వ్యక్తి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గత మూడు రోజులుగా అతడు గ్రామంలో భిక్షాటన చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96653 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై టి.సుధీర్ కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



విద్యుత్‌షాక్‌తో మరణించిన హెబ్రం

గణపవరం: గణపవరం మండలం వెంకట్రాజపురంలో చేపల చెరువుపై పని చేస్తున్న ఒక యువకుడు విద్యుత్‌షాక్‌తో మరణించిన సంఘటన ఆదివారం జరిగింది. గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రాజపురంలో గంధం గోవిందరావు చేపల చెరువు మీద ఒడిశా రాష్ట్రానికి చెందిన సిప్పు హెబ్రం(24) పనిచేస్తున్నాడు. ఆదివారం చెరువు వద్ద ఉన్న జనరేటర్ స్విచ్ ఆఫ్‌చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. అదే చెరువుపై పనిచేస్తున్న అతని అన్న సోదరుడిని పిప్పర పీహెచ్‌సికి తీసుకెళ్లగా అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఉద్యోగి అరెస్టు

నరసాపురం రూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన సచివాలయ ఉద్యోగి కటకటాల పాలయ్యాడు. ఇందుకు సంబంధిచి సీఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం కొప్పర్రు సచివాలయంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని పాలకొల్లు మండలం వెలివిలి సచివాలయంలో ఉద్యాన శాఖ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కోడూరి సుధీర్ వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశారు. ఈ విషయమై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నింధితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ వి.సురేష్ తెలిపారు.

కళకళలాడిన బీచ్



కాలేజీలు, స్కూళ్లకు సెలవులు కావడంతో ఆదివారం బీచ్‌కు విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. వాతావరణం మబ్బులుగా ఉండటం, ఉదయం నుంచి చిరు జల్లులు పడటంతో ఎక్కువ మంది పర్యాటకులు సముద్ర స్నానం చేయకుండా ఒడ్డునే గడిపారు.
-మొగల్తూరు

కొట్లాటపై కేసు నమోదు

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ లంకపాలంనకు చెందిన వీరవల్లి మహేశ్వరరావును అదే ప్రాంతానికి చెందిన కడలి నాగేశ్వరరావు, అతని భార్య భానుమతిలు దాడి చేసి కొట్టారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం మహేశ్వరరావుకు, నాగేశ్వరరావుకు మధ్య సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఆదివారం మహేశ్వరరావు సైకిల్ మీద వెళుతుండగా నాగేశ్వరరావు, అతని భార్య భానుమతి దారి కాసి నాగేశ్వరరావును ఇనుప రాడ్‌తో కొట్టారు. మహేశ్వరరావును కుటుంబ సభ్యులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తుల లారీలు, మినీవ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు. గుడి సమీపంలో ఆదివారం భక్తుల మధ్య కొట్లాట జరిగింది. నల్లజర్లకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో స్థానికులతో ఘర్షణ జరిగింది. నల్లజర్లకు చెందిన భక్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

28న ఆన్‌లైన్ చెస్ పోటీలు



చెస్‌పోటీల కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నూలి అభయ్ చారిటబుల్ ట్రస్ట్, మాస్టర్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ చెస్ టోర్నమెంట్‌ను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ కన్వీనర్, బీజీబీఎస్ మహిళా కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం టోర్నమెంట్ కరపత్రాలను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేత ఆయన నివాసం వద్ద విడుదల చేయించారు. టోర్నమెంట్‌లో విజేతలకు రూ.50 వేల నగదు బహుమతి ఇస్తామని చెప్పారు. 28వ తేదీ రాత్రి 7.15 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 6 ఏళ్లుగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్‌చెస్ అకాడమీ సంయుక్త కార్యదర్శి కె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రామానికి చెందిన మారంపూడి నాగరాజు(47) శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా నాగరాజు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూరవిద్య ప్రయోగ పరీక్షలకు 275 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యావిధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షకు ఆదివారం 275 మంది హాజరయ్యారు. భౌతిక శాస్త్రం పరీక్షకు 100 మందికి గాను 80 మంది, రసాయన శాస్త్రం పరీక్షకు 100 మందికి 89 మంది, జీవ శాస్త్రం పరీక్షకు 131 మందికి 106 మంది హాజరయ్యారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొవ్వాడ పుంతలో పేకాట శిబిరంపై రూరల్ ఎస్సై డి.మోహన్‌రావు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.1,950 నగదు స్వాధీనం చేసుకున్నారు.

డ్రోన్ సర్టిఫైడ్ పైలెట్‌గా రమేష్



డ్రోన్ సర్టిఫైడ్ పైలెట్‌గా లైసెన్స్ అందుకుంటున్న రమేష్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఐకార్ సంస్థలో తొలి డ్రోన్ సర్టిఫైడ్ పైలెట్‌గా జీలుగుమిల్లి ఐకార్ సీటీఆర్ఐ ఆర్ఎస్‌లో అసిస్టెంట్ ఫార్మర్‌గా పనిచేస్తున్న టి.రమేష్ లైసెన్స్ పొందారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్స్ ఏవియేషన్ పూనెలో నిర్వహించిన రాత పరీక్ష, ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి లైసెన్స్ పొందినట్లు రమేష్ తెలిపారు. డ్రోన్‌ల వినియోగానికి సంబంధించి తప్పనిసరిగా పైలెట్ సర్టిఫికెట్ అవసరమని చెప్పారు. ఇందుకోసం వారం రోజుల పాటు పూనెలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు.

శ్రీవారి సేవలో శ్రీశైలం దేవస్థానం ఈఓ



శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్నకు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓలు దుర్గారావు, నటరాజారావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దేవస్థానం ఈఓ లవన్న ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, పి.నటరాజారావు లు ఆయనకు చినవెంకన్న మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు




బెట్టింగ్ రాయుళ్లతో టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ ప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో జూదానికి తావులేదని, ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసి సమావేశంలో క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ళ వివరాలు తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు నగరంలో జూదరులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట శిబిరాలు, కోడిపందాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఏలూరు గన్‌బజార్ సెంటర్‌లో మేకల శ్రీనివాసరావు అనే వ్యక్తి ఒక గదిలో ఐపీఎల్-23 క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి ఆదివారం బెట్టింగ్ నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసరావు వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేందుకు ఉపయోగించే 5 సెల్‌ఫోన్లు, ఒక లాప్‌ట్యాప్‌తో పాటు రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ వేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వారి సెల్‌ఫోన్స్‌లోని ఆధారాల మేరకు ప్రధాన క్రికెట్ బుకీ ఏలూరు తంగెళ్ళమూడికి చెందిన ఠాగూర్, పిల్లా వెంకటేష్ అలియాస్ గుట్కాలు, ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన పెదపూడి నాని, బిల్లా రంగాపై కేసు నమోదు చేశారు. వీరితోపాటు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల్లో హైదరాబాద్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ చేస్తోన్న ఇమ్మంది అనంత్, బాబి అనే వారితో సహా ఇతర నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ చెప్పారు. క్రికెట్ బెట్టింగ్, బుకీలుగా ఎవరైనా ఉంటే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పోలీసు నిఘా నేత్రం.. మీ ఇల్లు భద్రం

దొంగతనాల నిరోధానికి ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానం



గృహాలలో ఏర్పాటు చేసే కెమెరాలు

నూజివీడు: వేసవిలో జనాలు పెళ్లిళ్లు, విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. ఇదే అదనుగా గ్రామాల్లో, పట్టణాల్లోని ఇళ్లల్లో పెద్దఎత్తున దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము దొంగలపాలవడంతో బాధితులు మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ తాళాలు వేసిన ఇళ్లను దొంగల బారి నుంచి కాపాడేందుకు నూతన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై అవగాహన పెంచుకుని ఉపయోగించుకుంటే దొంగలను సులువుగా పట్టుకోవచ్చు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ పనిచేసేది ఇలా....

లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)గా పిలిచి ఈ విధానంలో వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, యూపీఎస్, డాటా కార్డులను ప్రధానంగా ఉపయోగిస్తారు. ఎవరైతే తాళాలు వేసి ఊర్లు వెళతారో వారింట్లో దీనిని అమరుస్తారు. అక్కడి నుంచి ఆయా ప్రాంతంలోని పోలీసుస్టేషన్‌కు, ఇంటి యజమాని మొబైల్ ఫోన్‌కు వాటిని అనుసంధానం చేస్తారు. ఆ తరువాత పోలీసుస్టేషన్‌లో అలారం అమరుస్తారు. సిబ్బంది స్టేషన్‌లోని మానిటర్‌లో ఆ ఇంటిని గమనిస్తూ ఉంటారు. ఎవరైనా ఆ ఇంటి వద్దకు కెమెరా ముందుకు రాగానే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అలారం మోగుతుంది. వెంటనే సీసీ ఫుటేజీ ద్వారా ఆ ఇంటి వద్దకు ఎవరు వచ్చారు, ఎంతమంది వచ్చారనే విషయాలను పరిశీలిస్తారు. వెంటనే పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకుంటారు.

అందుబాటులో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. దీనిని ప్లేస్టోర్ నుంచి ఆండ్రాయిడ్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకొని ఇంటి యజమాని పేరు, ఇంటి నెంబరు, ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత ఓటీపీ నెంబరుతో యూజర్ ఐడీ వస్తుంది. ఎప్పుడైనా ఊళ్లకు, యాత్రలకు వెళ్తున్నప్పుడు దీని ద్వారా రిక్వెస్ట్ ఇవ్వాలి. ఫలానా రోజుల్లో ఇంట్లో ఉండమని తెలియజేస్తూ సమాచారం పంపితే పోలీసు అధికారులు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇంటి యజమాని తిరిగి వచ్చేంత వరకు ఆ ఇంటిపై పోలీసులు వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతారు. దీని ద్వారా దొంగలను సులువుగా పట్టుకోవడమే కాకుండా చోరీలు నిరోధించవచ్చు.

ఉచితంగానే సేవలు



ఎల్‌హెచ్‌ఎంఎస్ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. ఇంటికి తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు దీనిని ఉపయోగించుకోవాలి. పోలీసు శాఖ ఉచితంగానే ఈ విధానాన్ని అమలుచేస్తోంది. దీనికి రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదు. దొంగతనాలను పూర్తిస్థాయిలో నిరోధించాలంటే తప్పనిసరిగా ఈ విధానాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి.

ఈడే అశోక్‌కుమార్ గౌడ్, నూజివీడు డీఎస్పీ

చేతిరాత పోటీల్లో అవార్డు



జాతీయ స్థాయి చేతి రాత పోటీల్లో అవార్డు అందుకుంటున్న ఆలపాటి ప్రవర్షిక

చింతలపూడి: జాతీయ స్థాయి చేతి రాత దినోత్సవం సందర్భంగా జనవరి 23న నిర్వహించిన పోటీల్లో స్థానిక భాష్యం స్కూల్ విద్యార్థిని ఆలపాటి ప్రవర్షిక జాతీయ స్థాయిలో బెస్ట్ హ్యాండ్ రైటింగ్ అవార్డు సొంతం చేసుకుంది. ఆదివారం విజయవాడ నలంద విద్యానికేతన్‌లో జరిగిన కార్యక్రమంలో బహుమతి అందుకుంది.

క్లుప్తంగా

ఘనంగా బసవేశ్వరుని జయంతి



బసవేశ్వరుని జయంతి కార్యక్రమంలో దీక్షలలో పాల్గొన్న భక్తులు

తణుకు టౌన్: లింగ వివక్షను వ్యతిరేకిస్తూ సమానత్వం కోసం పాటు పడిన మహనీయుడు బసవేశ్వరుడు అని శైవ గురువు తాళ్ల సాంబశివరావు చెప్పారు. ఆదివారం బసవేశ్వరుని జయంతి సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని వీవర్స్ కల్యాణ మండపంలో పి.కనక లింగేశ్వరరావు, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది శివ భక్తులు లింగ దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ కర్ణాటకలోని బీజాపూర్‌లో జన్మించిన బసవేశ్వరుడు వైదిక కర్మ కాండలను వ్యతిరేకించడంతో పాటు కుల, మతాలకు కట్టుబాటులు విధించడాన్ని వ్యతిరేకించారని వివరించారు. కార్యక్రమంలో సప్పవరపు శివకోటయ్య, రోసపల్లి బసవ కోటయ్య, వాసా నరసన్న, కర్నెళ్ల గుణ సత్యనారాయణ, బళ్ల చిన వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేత కుంచనపల్లి జట్టు



విన్నర్‌కు ట్రోఫీ అందిస్తున్న పెద్దలు, జైభీమ్ యూత్ అసోషియేషన్ సభ్యులు

పెంటపాడు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని పెంటపాడు ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్లో నిర్వహిస్తున్న జైభీమ్ యూత్ అసోషియేషన్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కుంచనపల్లి టీం రన్నర్‌గా, గూడెం భాగ్యలక్ష్మిపేట టీం విన్నర్‌గా నిలిచారు. విన్నర్ టీంకు రూ.15 వేలు, రన్నర్ టీంకు రూ.10 వేలు చొప్పున దాత బి. ప్రీతం చక్రవర్తి సహకారంతో నిర్వాహకులు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఈశ్వరరావు దంపతులు, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దేవాబత్తుల నాగమణి, బాబి దంపతులు, విశ్రాంత ఆరోగ్యశాఖ అధికారి దేవాబత్తుల శామ్యూల్ రాజు, పడాల చిరంజీవిరెడ్డి, జైభీమ్ అసోషియేషన్ సభ్యులు, ఎస్వీవీఎస్ స్కూలు అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఏపీ టీవీ టెక్నీషియన్స్



తణుకులో మంత్రి కారుమూరితో టీవీ టెక్నీషియన్స్ సంఘ నాయకులు

తణుకు అర్బన్: ఏపీ టీవీ టెక్నీషియన్స్ సహకార సంఘం నాయకులు, సభ్యులు ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘటిత కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాన్ని వర్తింపజేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. స్పందించిన మంత్రి కారుమూరి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లుగా చెప్పారు. ముందుగా సంఘం ఆధ్వర్యంలో స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. దొర్ల వెంకట్రావు, సీహెచ్ గౌరీశంకర్, షేక్ షాహీద్, బీఎస్‌టీ నాగరాజు, యర్రంశెట్టి గంగాధరరావు, గుడాల శ్రీనివాస్, నాని, కేవీ సుబ్బారావు, కోడె సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయం వేరు -అభిమానం వేరు'



బల్లిపాడులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తణుకు టౌన్: 'రాజకీయం వేరు, అభిమానం వేరు' అనే పేరుతో మండపాకలో వెలసిన ఫ్లెక్సీలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సినిమా హీరోలకు అభిమానులు రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్నారని ప్రజల్లో ఉన్న అపోహను తొలగిస్తూ మండపాకలో ఇటీవల అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారి ఫొటోకి ఇరువైపులా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఫొటోలు, కింద భాగంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నిలువెత్తు ఫొటోలతో మధ్యలో 'రాజకీయం వేరు, అభిమానం వేరు' పేరుతో వేసిన ఫ్లెక్సీలు గ్రామస్తులను ఆకర్షిస్తున్నాయి. ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి సంక్షేమ పాలనకు నిదర్శనమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వాతావరణంలో అనూహ్య మార్పు



మోదుగగుంటలో ధాన్యం రాశులపై బరకాలు కప్పిన దృశ్యం



పుల్లాయగూడెంలో ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

- రూరల్‌లో కానరాని వర్షం ప్రభావం
- ముందుగానే ధాన్యం రాశులపై బరకాలు
- తాడేపల్లిగూడెంలో 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా రైతు గట్టెక్కాడు. ఆదివారం తెల్లవారు జామున ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పుతో తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటలవరకు అడపాదడపా వర్షం కురిసింది. ఉదయం 7.30నుంచి 8 గంటల మధ్యలో తాడేపల్లిగూడెంలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణం తడిసి ముద్దయింది. రూరల్ మండలంలో వర్షం జాడ కానరాలేదు. చెదురు మదురు చినుకులు మినహా వర్షం ప్రభావం అంతగా కనపడలేదు. ఈ నేపథ్యంలో రైతు వరుణుడి బారినుంచి గట్టెక్కాడని చెప్పవచ్చు. మండలంలో దాళ్వా కోతలు ముమ్మరంగా సాగడంతో ఒకేసారి పంట చేతికొచ్చింది. దిగుబడులు సైతం ఈ సీజన్‌లో అధికంగానే వచ్చాయని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని కల్లాల్లో, రోడ్ల వెంబడి బరకాలు వేసి ఆరబెట్టారు. కొందరైతే ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించి నెట్టులుగా వేశారు. రైతు ముందు చూపే వర్షం బారి నుంచి గట్టెక్కించిందని చెప్పకతప్పదు. దీనికి తోడు వర్షం ప్రభావం లేకపోవడం కూడా ఒకింత రైతుకు మేలు చేసిందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఆరుదల ధాన్యానికి 75 కిలోల బస్తాకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి రూ.1,400, ఆర్‌బీకేలద్వారా రూ.1,530 లభిస్తోంది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో విక్రయించేందుకు రోడ్ల వెంబడి ఆరబెట్టి సిద్ధం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో వాతావరణ మార్పులు వారి గుండెల్లో రైళ్ల పరిగెట్టిస్తున్నాయి. మరో రెండ్రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యాన్ని గట్టెక్కించేందుకు లారీ, ట్రాక్టర్, జట్టు కూలీల వెతుకులాటలో రైతులు ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సందర్భంలో ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు స్థానికంగా గ్రామాల్లో గోదాములు అందుబాటులో ఉంటే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

అత్యధిక వర్షపాతం నమోదు

జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే తాడేపల్లిగూడెంలోనే ఆదివారం ఉదయం అత్యధిక వర్షపాతం నమోదైంది. కేవలం అరగంట వ్యవధిలోనే 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తదు పరి స్థానంలో పాలకోడేరు 20.4, గణపవరం మండలంలో 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షంతో రైతుల బెంబేలు

పెంటపాడు: దాళ్వా పంట చేతిక వచ్చిన తరుణంలో రైతులు నాలుగు రోజులుగా మాసూళ్లు ముమ్మరంగా చేపట్టారు. ధాన్యం రాసులు పలు ప్రాంతాల్లో ఆరబెడుతున్నారు. ఆదివారం ఉదయం ఆకాశం మబ్బుగా ఉండటం, కొద్దిగా వర్షం కురవడంతో రైతులు కంగారు పడ్డారు. హడావుడిగా ధాన్యం రాసులపై బరకాలు, గడ్డి కప్పారు. ముమ్మరంగా వరి మాసూళ్ల చేపడుతున్న తరుణంలో వాతావరణశాఖ ప్రకటనతో రైతులు బెంబేలెత్తారు. కోతకోసిన ధాన్యం రాసులపై బరకాలు కప్పుకొని సంచుల్లో ధాన్యం ఒబ్బిడి చేస్తున్నారు. మరో వారం రోజులు వాతావరణం అనుకూలంగా ఉంటే రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.



పెంటపాడులో ఆరబెట్టిన ధాన్యం రాసులపై గడ్డి, బరకాలు కప్పిన రైతులు

వాడవాడలా మేడే నిర్వహించాలి

తణుకు: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను కార్మికులు వాడవాడలా నిర్వహించి అరుణపతాకాలు ఆవిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. ఏఐటీయూసీ తణుకు ఏరియా సమితి సమావేశం ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో భీమారావు పాల్గొని మాట్లాడుతూ కార్మికులు వ్యతిరేకంగా ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు అమలుకు మేడే రోజున నినదించాలని కోరారు. ఏఐటీయూసీ తణుకు ఏరియా ఉపాధ్యక్షులు బొద్దాని నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, కార్మిక సంఘాల నాయకులు అట్రు వెంకట్రావు, నాగశివశంకర్, బొంగు శ్రీరామ్మూర్తి, కేవీ రమణ, మందుల ముత్తయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 12 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం, మండపాక ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పైడిపర్రుకు చెందిన అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సభ్యులు జాలా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి స్వర్ణయుగం జగనన్నతోనే సాధ్యం

పెంటపాడు: జగనన్న పాలనతో స్వర్ణయుగం తప్పక సాధ్యమని పెంటపాడు ఎస్సీ నాయకులు పేర్కొన్నారు. పెంటపాడులోని కునాకరపేటలో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎస్సీ నాయకులైన చదలవాడ శ్రీనివాస్, తాడేపల్లి ఈశ్వరరావు, వార్డు సభ్యుడైన మారంపూడి ఏసుదాసు తదితరులు కునాకరపేటలోని పలు ప్రాంతాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రచారంలో భాగంగా ప్రజలకు అందిన పథకాలు వివరించారు. వచ్చే ఎన్నికలలో జగనన్నను బలపరచి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తమ నాయకుడుగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల అమలుపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరపు గోపి, గ్రామ పార్టీ ఎస్సీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు. రావిపాడు, అలంపురం, తదితర గ్రామాల్లో సర్వే నిర్వహించారు. పెంటపాడులో మరో ప్రాంతంలో కొనసాగుతున్న కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, సత్తి ముత్యప్రసాద్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



పెంటపాడు కునాకరపేటలో ప్రచారం చేస్తున్న ఎస్సీ నాయకులు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సభ్యులు



జువ్వలపాలెం సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఎదురుగా కె.ఎన్.రోడ్డులో ఆదివారం దాతలు, ఆర్యవైశ్యులు గ్రంధి సత్యనారాయణ, రత్నావతి దాత సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాహార్తులకు మజ్జిగను పంపిణీచేశారు. అనంతరం వృద్ధాశ్రమానికి రూ.10,116 అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, జి.మాణిక్యాలరావు, సెక్రటరీ వంగ పండు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, డీవీపీ విశ్వేశ్వరరావు, గరికపాటి బాపయ్యశర్మ, పీవీ సూర్యనారాయణమూర్తి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 16వ వార్డు జువ్వలపాలెం సెంటరులో రాధాకృష్ణ కామధేను సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ జువ్వలపాలెం ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే బాటసారులకు ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం సమయం వరకు మజ్జిగ పోస్తారని అనంతరం మంచినీటిని అందజేస్తారని తెలిపారు. తణుకు రోడ్డులో రాకపోకలు సాగించేవారు తమ చలివేంద్రం వద్ద దాహార్తిని తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ కామధేను సేవా సమితి సభ్యులు పాలూరి వెంకటేశ్వరరావు, పెండ్యాల చంద్రశేఖర్, పాతూరి దొరబాబు, పాలూరి బలుసులు, లింగం శ్రీను, మద్దుకూరి బ్రదర్స్, బాలం బ్రదర్స్, తోట రమేశ్వరి పాల్గొన్నారు.

బల్లిపాడులో..

అత్తిలి: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తణుకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కాకర్ల సత్యనారాయణ చెప్పారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఆశీస్సులతో బల్లిపాడు గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పీఠం కార్యకర్త యర్రంశెట్టి శివన్నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, పీఠం సభ్యులు ఖమ్మంపాటి సర్వమూర్తి, చీపురుపల్లి సత్యనారాయణ, దిరిశాల శ్రీనివాస్, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు విధేయులై వివిధ పార్టీల నుంచి యువకులు వైఎస్సార్‌సీ పీలో చేరడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్ అన్నారు. తణుకు పట్టణానికి చెందిన 50 మంది యువకులు ఆదివారం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులంతా పార్టీకి అండగా నిలబడి 2024లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిని చేసే విధంగా కష్టపడాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ యూత్ అధ్యక్షుడు చేశెట్టి లలితా శంకర్, ఉపాధ్యక్షులు కారుమంచి యోహాన్, నత్తా భాను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీస్తు రక్షణ సువార్త కూడికలు

పెంటపాడు: గూడెంలోని కడకట్ల క్రిస్టమాస్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి రెండు రోజుల పాటు క్రీస్తు రక్షణ సువార్త కూడికలు నిర్వహించనున్నట్లు సభల కన్వీనర్ బుంగా విద్యాసాగర్ తెలిపారు. హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ జెర్మియా ఈ సభలలో దేవుని వాక్యం అందిస్తారన్నారు. గూడెం ఫ్లెఓవర్ బ్రిడ్జి, సబ్‌స్టేషన్ వద్ద ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశాలను క్రైస్తవ భక్తులు, విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు, లోకేష్ వ్యాఖ్యలపై దళితుల నిరసన



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రాస్తారోకో చేస్తున్న దళిత వర్గాల నాయకులు



అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీసెల్ మండల నాయకులు

తణుకు అర్బన్: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ దళిత ద్రోహులుగా పేరుగాంచారని దళిత నాయకులు పేర్కొన్నారు. దళిత నేత, రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌పై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతోపాటు ఇటీవల దళితులపై లోకేష్ చేసిన వ్యాఖ్యలపై దళిత వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆదివారం తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ నిరసన తెలిపి, రాష్ట్రపతి రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు పెనుమాల రాజేష్, జంగం ఆనంద్‌కుమార్, పొట్ల సురేష్, సుద్దుల పాండు మాట్లాడుతూ దళితులపై మొదటి నుంచి చంద్రబాబుకు చిన్నచూపు ఉందని గతంలో అనేకమార్లు దళితులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ దళితులను కించపరిచే విధంగా ఆయన ప్రవర్తిస్తున్న తీరును ఖండిస్తున్నామని అన్నారు. ఆయన కుమారుడు సైతం దళితులపై నీచంగా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. దళితుల ఆగ్రహాన్ని టీడీపీకి రానున్న ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నత్తా భాను, జగన్, నక్కా రమేష్, భావన శ్రీను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

అత్తిలి: దళితజాతిపై చంద్రబాబు, లోకేష్ చేస్తున్న అనుచిత ప్రవర్తనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు ఆధ్వర్యంలో అత్తిలి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. దళితజాతికి లోకేష్, చంద్రబాబు తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశఋూరు. ప్రజలు అధికారం నుంచి దింపేసిన చంద్రబాబుకు అగ్రకుల అహంకారం పోలేదని , సీఎం హోదాలో కూడా చంద్రబాబు దళితులను కించపరిచే విధంగా వ్యాఖ్యానాలు చేశారని గుర్తు చేసారు. ఇప్పుడు లోకేష్ కూడా చంద్రబాబు బాటలోనే నడుస్తూ దళితుల మనోభావాలను కించపరుస్తూ హేళన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ బొద్దు ఆమోసు, ఏఎంసీ డైరెక్టర్ రాయుడు ధర్మారావు, సబ్బితి రాజేష్, కంకిపాటి రత్నరాజు, యాళ్ల సాధు సుందర్‌సింగ్, ఈదూరి శ్యాంబాబు, బుంగా పద్మారావు, యార్లగడ్డ సాగర్, ఇల్లూరి సంపదరావు, వూడిమూడి ప్రసాద్, యాళ్ల స్వామి, పొన్నమల్లి సంపతరావు పాల్గొన్నారు.

అవిలా యూనివర్సిటీతో శశి ఎంఓయూ



అవిలా యూనివర్సిటీతో శశి ఇంజినీరింగ్ కాలేజ్ ఎంఓయూ కుదుర్చుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: యునైటెడ్ స్టేట్స్‌లోని మిస్సోరియాకు చెందిన అవిలా యూనివర్సిటీతో శశి ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల యాజమాన్యం ఆదివారం వెల్లడించింది. విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలంటే యూనివర్సిటీ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ పరంగా, నాలెడ్జ్ పరంగాను అభివృద్ధి చెందడానికి ఈ ఒప్పందం ఉపకరిస్తుందన్నారు. సంస్థ వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, సెక్రటరీ కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, అవిలా వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెంటపాడు గ్రామదేవతల జాతరకు ఏర్పాట్లు

పెంటపాడు: మే 6 నుంచి పెంటపాడు గ్రామ దేవతలైన పెంట్లమ్మ, కొర్లపాటి వెంకమ్మల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఏడేళ్లకు ఒకసారి నిర్వహించనున్న జాతర మహోత్సవాలకు సంబంధించి ఇటీవల ఆలయ కమిటీ సమావేశంలో కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక పెంట్లమ్మ పూరిగుడి వద్ద ప్రత్యేక పూజల అనంతరం వారు మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. జాతరలో భాగంగా తొలిరోజైన శనివారం తెల్లవారు జామున పొలిమేర కట్టి అమ్మవారికి గరగ మొక్కులు, చలిమిడి పానకాలు సమర్పిస్తామన్నారు.7వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు, అమ్మవారిని అత్తారింటికి పంపడం, పూరిగుడి పండించడం, సాయంత్రం వార్షిక పొన్నులు, రాత్రికి సంగంమేడ వద్ద నున్న గర్భగుడి వద్ద మొక్కుల చెల్లింపు, నైవేద్యాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా సాగేలా గ్రామస్తుల సహకారం ఉండాలని కోరారు. 7 ఏళ్లకోసారి అమ్మవారికి జాతర, మూడేళ్లకు ఒకసారి అమ్మవారి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. కమిటీ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సత్తి నర్సిరెడ్డి, కార్యదర్శిగా చామన విజయకుమార్, కొవ్వూరి నాగవెంకటబాలభాస్కరరెడ్డి, శీలంశెట్టి రామచంద్రరావు, చామన వీరవెంకట సురేష్, వెలగల శ్రీనివాసరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పెంటపాడు పెంట్లమ్మ పూరిగుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

వరికోతలు వాయిదా వేసుకోవాలి



అత్తిలిలో వరికోత యంత్రం ద్వారా పంట కోత కోస్తున్న దృశ్యం

అత్తిలి: వాతావరణ అధికారుల సూచనల మేరకు రాగల రెండు రోజుల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నందున రైతాంగం వరి కోతలు రెండురోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్తిలి మండలంలో వరికోతలు ఇప్పుడే ముమ్మరంగా చేపట్టారని, వాతావరణ మార్పులతో వర్షం పడడంతో వరిమాసూళ్లు ఆపాలని చెప్పారు. మండలంలో ఎక్కువగా ఎంటీయూ -1121 రకం సాగు చేశారని, ఇది పడిపోయే గుణంలేనిదని, కాబట్టి 2-3 రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలతో కప్పి, వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలని చెప్పారు. పొరపాటున ధాన్యం తడిస్తే ఉప్పు ద్రావణం 5 శాతం పిచికారీ చేసుకుని ఆరబెట్టుకుంటే మొలకరాదని, రంగుమారదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది త్వరితగతిన రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానాన్ని వేగవంతం చేసి, కేటాయించిన ధాన్యాన్ని మిల్లులకు పంపే ఏర్పాట్లు కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు ఏఓ రాజేష్ వివరించారు.

26న వాహన వేలం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్ఈబీ కేసులో స్వాధీనం చేసుకున్న స్ప్లెండర్ వాహనానికి ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

వైభవంగా లక్ష్మీ కుబేర వ్రతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం ఉదయం నిత్యార్చనలు, గణపతి పూజ, లక్ష్మీ అష్టోత్తర పూజలు, కుబేరవ్రతం నిర్వహించారు. అర్చకులు మంగిపూడి సీతారామయ్య, మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.